
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
సోమవారం 12 మే 2025



ఉష్ణోగ్రత (అంచనా)

| 12-5-2025 | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| గుంటూరు | 43 | 27 |
| తెనాలి | 42 | 28 |
| నరసరావుపేట | 42 | 27 |
| బాపట్ల | 41 | 28 |
| రెంటచింతల | 42 | 29 |
| చీరాల | 41 | 28 |

# హాజరుకు.. గంతలు

- ఫోన్‌తో ఏ మార్చి హాజరు
- ఐ-ఎఫ్ఆర్ఎస్ యాప్‌కు గంతలు
- ఆరోగ్య శాఖలో మాయా మశ్చీంద్రలు
- సమయం, స్థలం మార్చి హాజరు నమోదు
- మూడు జిల్లాలో 71 మందికిపైగా చర్యలకు రంగం సిద్ధం




కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు అందుబాటులో ఉండటం లేదు. పేరుకు ఇద్దరు ఉన్నా ఒక్కరు కూడా సక్రమంగా విధుల్లో ఉండరు. మారుమూల ప్రాంతాల్లో అయితే వైద్యులు, నర్సింగ్ సిబ్బంది ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో కూడా ఎవరికీ తెలియడంలేదు.

- జడ్పీ సమావేశాల్లో జడ్పీటీసీల ఫిర్యాదు

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో సేవలు సక్రమంగా అందడంలేదు. అత్యవసరంగా వెళ్లినా డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది అందుబాటులో ఉండటంలేదు. అడిగితే మీటింగ్‌కు లేదంటే క్యాంపునకు వెళ్లారంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లోని పెద్దాస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది.

- రోగుల ఆవేదన

గుంటూరు సిటీ, మే 11 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో ఇదీ పరిస్థితి. వైద్యులు, వైద్య సిబ్బంది కొరత వల్ల ఈ పరిస్థితి అని అనుకుంటే తప్పులో కాలేసినట్లే. అందుబాటులోకి వచ్చిన సాంకేతికతను అందిపుచ్చుకుని వైద్యులు, వైద్య సిబ్బంది తమకు కావాల్సినప్పుడు విధులకు వచ్చి వెళ్లిపోతున్నారు. కొందరైతే ఆస్పత్రులకు రాకుండా విధుల్లో ఉన్నట్లు హాజరు వేసుకుంటున్నారు. వేళలను పాటిస్తూ తప్పనిసరిగా విధుల్లో ఉంటూ రోగులకు అందుబాటులో వైద్యులు, వైద్య సిబ్బంది ఉండేలా ప్రభుత్వం పక్కాగా హాజరును అమలు చేస్తుండగా.. విధులకు గైర్హాజరయ్యేందుకు పలువురు అడ్డదారులు తొక్కుతున్నారు. పల్నాడు జిల్లాలో పది మంది వైద్యులు, 20 మంది సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, గుంటూరు జిల్లాలో 17 మంది వైద్యులు, ఇద్దరు హెల్త్ ఎడ్యుకేటర్లు, 10 మంది పారామెడికల్ సిబ్బంది, బాపట్ల జిల్లాలో 12 మంది డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బందిపై రాష్ట్ర అధికారులకు రాత పూర్వకంగా ఫిర్యాదులు వెళ్లడం కలకలం రేపుతుంది.

## చర్యలు తీసుకున్నా మారరా..

ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై రాష్ట్ర ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సుమారు 140 మంది సిబ్బందిని శాశ్వతంగా విధుల్లో నుంచి తొలగించారు. వారిలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న డాక్టర్లు కూడా ఉన్నారు. ఒక వైపు ప్రభుత్వం ఇంత సీరియస్‌గా ఉన్నా కొందరు అధికారులు, సిబ్బందిలో ఏ మాత్రం మార్పు రాకపోవడం గమనార్హం.

## సెట్టింగ్స్‌లో మార్పులు చేసుకుని..

ఐ-ఫోన్ ఆధారంగా తేదీ, సమయం, ఊరు మార్చి ఎఫ్ఆర్ఎస్(ఫేషియల్ రెకగ్నైజేషన్ సిస్టం) యాప్‌ను పక్కదారి పట్టిస్తున్నారు. ఫోన్‌లో ఉన్న స్టాండర్డ్ సమయం మార్చి ఎప్పుడు హాజరు వేసినా సకాలంలోనే వేసినట్లుగా చూపించేలా సెట్టింగ్స్‌ను మార్చేసుకుని ప్రభుత్వాన్ని, ఉన్నతాధికారులను బురిడీ కొట్టేస్తున్నారు. ఉదాహరణకు ఉదయం 9 గంటలకు ఆరోగ్య కేంద్రంలో ఉండాల్సిన ఉద్యోగి ఆ పరిసరాల్లోకి వెళ్లి ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు వేయాలి. జీ పీ ఎ స్ లో మార్పుల ద్వారా ఇంట్లో ఉన్నా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్నట్లు చూపించవచ్చు. ఉదాహరణకు సాయంత్రం 4 గంటలకు చివరి హాజరు వేసి ఉద్యోగి ఇంటికి బయలుదేరాలి. కానీ ఫోన్‌లో స్టాండర్డ్ సమయం మార్చి సమయాన్ని ముందుకు వెనక్కి మార్చే వెసులుబాటు ద్వారా మధ్యాహ్నం 2 గంటలకే సాయంత్రం 4 గంటల హాజరు కూడా వేస్తున్నట్లు తెలుస్తుంది.

### ● పల్నాడు, గుంటూరు జిల్లాల్లో మరీ దారుణం..

ఎఫ్ఆర్ఎస్ యాప్ విషయంలో ప్రభు త్వం ఎంత సీరియస్‌గా ఉన్నా కొందరు వైద్యుల తీరులో మార్పు రావడం లేదు. ఎఫ్ ఆర్ఎస్ అప్రూవల్ అంతా వైద్యుల చేతుల్లోనే ఉంటుంది కాబట్టి వారు ఇష్టానుసారంగా వ్యవహ రిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. కొందరు డాక్టర్లు 104 డ్యూటీకి వెళ్తున్నామని చెప్పి అక్కడ ఒక్క ఫొటో దిగి సిబ్బందికి పని అప్పగించి వెళ్లిపోతున్నట్లు ఆరోపణలున్నాయి. మధ్యాహ్నం తర్వాత చాలామంది వైద్యులు విధుల్లో ఉండటం లేదని ఆరోపణలు ఉన్నా జిల్లా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రభుత్వానికి ఫిర్యాదు వెళ్లాయి. ఉదాహరణకు పల్నాడు జిల్లా కృష్ణా నది సమీప మండలంలోని ఓ డాక్టర్, ఎంపీహెచ్ఈవో సమయానికి విధులకు హాజరు కాకుండానే హాజరైనట్లు చూపిస్తున్నారని ప్రభుత్వానికి ఇటీవల పలువురు ఫిర్యాదు చేశారు.

# సచివాలయం.. గందరగోళం

పాలనను ప్రజలకు దరి చేర్చాలి.. వారి గడప వద్దే ప్రభుత్వ సేవలు అందించాలని గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి.. దానిని ఓ ప్రహ సనంగా నడిపింది. పోస్టింగ్‌ల దగ్గర నుంచి పనుల వరకూ అంతా గందర గోళమే. కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ప్రక్షాళనకు సిద్ధమ వ్వగా.. అదో ప్రహసనంగా మారింది. గత ప్రభుత్వ మార్గదర్శకాల్లో నెలకొన్న అస్పష్టత.. సిబ్బంది సంఖ్యలో లెక్కలు లేకపోవడం.. అసలు ఏ శాఖలో ఎవరు ఉంటున్నారు.. ఎవరు ఎక్కడ పని చేస్తున్నారు. ఎవరు ఏ పని చేస్తున్నారనే విషయంలోనే స్పష్టత లోపించింది. సచివాలయాలను ప్రజాప్రయోజనంగా మార్చడానికే ప్రభుత్వం ఈ రేషనలైజేషన్ నిర్ణయం తీసుకుంది. కానీ క్షేత్రస్థాయిలో అనేక చిక్కుముడులు అలానే ఉన్నాయి. వాటి విషయంలో స్పష్టత ఇవ్వకుండా హడావిడిగా ఈ ప్రక్రియ చేపడితే అది కాస్తా మొక్కుబడి తంతుగా మారి అసలు ఉద్దేశం నీరుకారిపోయే ప్రమాదం ఉంది.

- ప్రహసనాన్ని తలపిస్తున్న క్రమబద్ధీకరణ
- ఇప్పటికే వివిధ విభాగాల్లో సిబ్బంది డిప్యూటేషన్
- గుంటూరులో మిగులు.. బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కొరత
- మార్గదర్శకాల్లోనే అస్పష్టత.. కొలిక్కి తెచ్చేందుకు కసరత్తు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సచివాలయ వ్యవస్థ ఏర్పాటు నుంచి, సిబ్బంది నియామకం వరకు ప్రతి దశలోనూ వైసీపీ ప్రభుత్వం లోపాల పుట్టగా మార్చింది. ఓ ప్రణాళిక లేకుండా సిబ్బంది నియామకాన్ని ఆయా వార్డులు, గ్రామాల అవసరాలను బట్టి కాకుండా మమ అనిపించే విధంగా తంతును పూర్తి చేసింది. ఇక మున్సిపాలిటీ, అంగన్వాడీలు ఇలా పలు విభాగాలకు సమాంతరంగా ఆ వ్యవస్థ పనిచేస్తుండడంతో ఉద్యోగులు ఒకరి మీద ఒకరు ఫిర్యాదు చేసుకునే వరకు పలుసార్లు వెళ్లడం ఆ వ్యవస్థ డొల్లతనానికి సూచికగా నిలిచింది. వాటిని సరిదిద్ది సచివాలయాల క్రమబద్ధీకరణ చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. ప్రజల అవసరాలకు అనుగుణంగా సిబ్బందిని సర్దుబాటు చేసే ప్రక్రియను చేపట్టింది. అయితే గత ప్రభుత్వం అవలంభించిన అస్తవ్యస్త విధానాలకు తోడు, ప్రస్తుతం జారీ చేసిన మార్గదర్శకాలలో కూడా స్పష్టత లేకపోవడంతో క్రమబద్ధీకరణ ప్రక్రియ ప్రహసనాన్ని తలపిస్తోంది. పలువురు సచివాలయ ఉద్యోగులు ఇప్పటికే డిప్యూటేషన్‌పై వివిధ విభాగాల్లో ఉన్నారు. దీంతో సర్దుబాటు ప్రక్రియ సిబ్బందిని అయోమయంలో నెట్టివేసింది.




## అవసరం లేని విభాగాల్లో 2,200 మంది సిబ్బంది...

సచివాలయాలను కొలువుదీర్చినప్పుడు 21 విభాగాలను గుర్తించి.. పోస్టింగ్‌లకు వచ్చేప్పటికి 11 శాఖలకే పరిమితమైంది. ఇక శాఖల వారీగా ఉద్యోగులను సగటున ఒక్కో సచివాలయంలో 9 మందిని నియమించింది. సరే వీరికి విధుల అప్పగింతలో గందరగోళమే నడిచింది. తీర ప్రాంతమే లేని చోట ఫిషరీస్ అసిస్టెంట్‌ను కేటాయించారు. ఇలా అవసరం లేని చోట మూడు జిల్లాల పరిధిలో దాదాపు 2,200 మంది వరకు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు కూటమి ప్రభుత్వం తేల్చింది. సచివాలయాల ఏర్పాటు ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన జరిగింది. బాపట్ల, పల్నాడు జిల్లాలుగా ఆవిర్భవించినప్పుడు సరిపడా సిబ్బంది లేకపోవడంతో వివిధ విభాగాల అవసరాలకు పలువుర్ని డిప్యూటేషన్ ప్రాతిపదికన నియమించుకున్నారు. వీరిలో అధికశాతం సచివాలయ సిబ్బందే ఉన్నారు.

ప్రస్తుతం చేపడుతున్న సర్దుబాటులో భాగంగా మిగులు సిబ్బందిని క్రమబద్ధీకరణలో భాగంగా కొత్తగా ఏర్పాటయ్యే సచివాలయాల్లో కొలువుదీర్చాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కానీ గుంటూరు జిల్లాలో సచివాలయ సిబ్బంది అదనంగా ఉండే అవకాశం ఉంది. బాపట్ల, పల్నాడు జిలాల్లో ఆ పరిస్థితి లేదని తెలుస్తోంది. మరోవైపు రేషనలైజేషన్ కసరత్తు జరుగుతుండగానే అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని ఎప్పటికకప్పుడు ప్రభుత్వానికి నివేదించేందుకు నియోజక వర్గానికి 5 గురు సచివాలయ సిబ్బందిని కేటాయించాలని ఆదేశాలు రావడంతో మొత్తం ప్రక్రియే గందరగోళాన్ని తలపిస్తోంది.



కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులు

## కన్నులపండువగా.. కల్యాణోత్సవం

అద్దంకి, మే 11 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనరసింహస్వామి జయంతి సందర్భంగా శింగరకొండలో స్వామివారి కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. కొండపై ఉన్న లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్‌కు అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కల్యాణోత్సవం కన్నులపండువగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో శింగరకొండకు తరలివచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించారు. చినగంజాం మండలం కడవకుదురుకు చెందిన సోమిశెట్టి వెంకటరావు రూ.11 వేల విలువైన శంఖు, చక్రం, నామాలతో కూడిన వెండి దీపారాదనను ఈవోకు అందజేశారు. అద్దంకికి చెందిన దామ మురళీకృష్ణ జ్ఞాపకార్థం భార్య రాజ్యలక్ష్మి రూ.15 వేల విలువైన కొబ్బరికాయలు కొట్టే స్టాండ్‌ను అందజేశారు.

## బస్టాండ్లలో పోలీసు తనిఖీలు

● అనుమానితుల సమాచారం ఇవ్వాలన్న డీఎస్పీ



బాపట్ల పాతబస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

బాపట్ల, మే 11 (ఆంధ్రజ్యోతి): భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య యుద్ధవాతావరణం నెలకొన్న నేపథ్యంలో బాపట్లలోని కొత్త, పాతబస్టాండ్లలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఏఆర్ పోలీసులు, బాంబుస్క్వాడ్, పోలీసు జాగిలాలతో బస్టాండ్లలోని పార్సిల్ కేంద్రాలు, ప్రయాణికుల బ్యాగ్‌లు, బస్సుల్లోనూ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ రామాంజనేయులు మాట్లాడుతూ అనుమానిత వ్యక్తుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు పోలీసులకు ఇవ్వాలని ప్రజలకు సూచించారు. క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే వస్తువులను డెలివరీకు పంపించాలని కొరియర్ యజమాన్యానికి సూచించారు. ఈ తనిఖీల్లో డీఎస్పీలు రామాంజనేయులు, విజయసారథి, సీఐ రాంబాబు, ఎస్ఐలు శ్రీనివాసరావు, చంద్రావతి తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి ఉద్యమ నేతలకు పెద్దపీట



రాయపాటి శైలజ



ఆలపాటి సురేష్



డాక్టర్ రవి వేమూరి



మల్లె ఈశ్వరరావు

- ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా రాయపాటి శైలజ
- 'విధ్వంసం' రచయిత ఆలపాటి సురేష్‌కు ప్రెస్ అకాడమీ చైర్మన్
- వడ్డెర సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా మల్లె ఈశ్వరరావు
- ఏపీఎన్ఆర్‌టీఎస్ చైర్మన్‌గా తెనాలివాసి డాక్టర్ రవి వేమూరి

గుంటూరు, తూర్పు, తెనాలి, మే 11 (ఆంధ్రజ్యోతి): తాజాగా ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల్లో అమరావతి ఉద్యమ నేతలతో పాటు విధేయ నేతలకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన నలుగురు నేతలను కీలక కార్పొరేషన్ చైర్మన్ పదవులు వరించాయి. అమరావతి జేఏసీ నేతగా గుర్తింపు తెచ్చుకున్న డాక్టర్ రాయపాటి శైలజకు ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవి, అమరావతి ఉద్యమ నేపథ్యం, గత ఐదేళ్ల అరాచక పాలనపై 'విధ్వంసం' అనే నవలా రచయిత ఆలపాటి సురేష్‌కు ప్రెస్‌అకా డమీ చైర్మన్ పదవి ఇచ్చి వారి సేవలను గుర్తిం చింది.

● రాయపాటి శైలజ మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు సోదరుడైన గోపాలకృష్ణ (చిన్ని ) కుమార్తె. రాజకీయ కుటుంబ నేపథ్యం ఉన్నా ఆమె పెద్దగా రాజకీయాల్లో లేరు. వైసీపీ ప్రభుత్వం తెరమీదకు తెచ్చిన మూడు రాజధానులను వ్యతిరేకిస్తూ శైలజ పోరు బాటతో తెరపైకి వచ్చారు. అమరావతి రక్షణ కోసం ఏర్పాటైన అమరావతి పరిరక్షణ సమితిలో భాగ స్వామిగా మారి ఉద్యమాన్ని ముందుండి నడిపారు. 2020 మార్చి 8న చేపట్టిన కనకదుర్గమ్మ ముడుపుల కార్యక్రమంలో ఆమెపై పోలీసులు విరుచుకుపడినా వెనక్కి తగ్గలేదు. ఆ తర్వాత న్యాయస్థానం టూ దేవస్థానం పాదయాత్రలో క్రియాశీలకంగా పాల్గొ న్నారు. 54 రోజులు సాగిన పాదయాత్రలో ఆమె అగ్రభాగాన నిలిచారు. వెయ్యిరోజుల ఉద్యమ నేప థ్యంలో చేపట్టిన మహా పాదయాత్ర-2.0లో కూడా శైలజ కీలకపాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో అమ రావతి ఉద్యమంలో ఆమె పోరాటాన్ని గుర్తించిన ప్రభుత్వం ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవి ఇచ్చి గౌరవించింది.

● తెనాలికి చెందిన ఆలపాటి సురేశ్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా నియమించింది. ఆయన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో వివిధ హోదాల్లో పని చేశారు. టీవీ-9లో ఇన్‌పుట్ ఎడిటర్‌గా పనిచేశారు. జర్నలిస్టు ఉద్యమంలో అత్యంత క్రియాశీలకంగా ఉండే ఆలపాటి సుదీర్ఘకాలం ఏపీయూడబ్ల్యూజే, ఐజేయూల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఆయన రచించిన విధ్వంసం పుస్తకాన్ని ప్రతిపక్ష నేతగా చంద్రబాబు అప్పట్లో ఆవిష్కరించారు.

● గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన మల్లె ఈశ్వరరావును వడ్డెర సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పదవి వరించింది. టీడీపీ బీసీ విభాగం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, ఎన్టీఆర్ జిల్లాకో ఆర్డినేటర్‌గా, ఏపీ వడ్డెర సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఆయన ఉన్నారు. దీర్ఘకాలంగా పార్టీకి అందించిన సేవలను గుర్తింపుగా ఈ పదవి ఆయన్ను వరించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వడ్డెరల సంక్షేమానికి కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

● తెనాలికి చెందిన ఎన్నారై డాక్టర్ రవి వేమూరిని ఏపీ నాన్ రెసిడెన్షియల్ తెలుగు సొసైటీ(ఏపీఎన్ఆర్‌టీఎస్) చైర్మన్ పదవి వరించింది. తెనాలికి చెందిన వేమూరి అభిరామేశ్వరరావు, ఆంధ్రభారతి దంపతుల కుమారుడైన రవి వైద్యరంగంలో విశేష సేవలందిస్తూ అమెరికాలో స్థిరపడ్డారు. 2014 నుంచి 2019 మధ్య కూడా ఆయన ఇదే సొసైటీకి చైర్మన్‌గా పనిచేశారు. ఆ సమయంలో ఆయన చేసిన సేవలకు గుర్తుగానే మరోసారి కూటమి ప్రభుత్వం చైర్మన్ బాధ్యతలను తిరిగి ఆయనకు అప్పగించింది. ప్రవాస తెలుగువ్యవహారాల సలహాదారుడిగా గతంలో రవి పనిచేశారు. రాష్ట్రం ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పెట్టుబడుల అవసరం ఎక్కువగానే ఉందని వీటిని సాధించేందుకు కృషి చేస్తానని రవి తెలిపారు.

## సన్‌డే



● పెరిగిన ఎండ తీవ్రత
● రోహిణి కార్తెకు ముందే భగభగ


గుంటూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): ఎండ.. ఉక్కపోత మధ్య అడపాదడపా ఈదురుగాలులు.. ఆకాశం మేఘావృతం.. వర్షాలతో ఉపశమనం పొందిన ప్రజలు ఆదివారం పెరిగిన ఉష్ణోగ్రతతో అల్లాడిపోయారు. ఆదివారం గుంటూరు, పల్నాడులో జిల్లావ్యాప్తంగా, బాపట్ల జిల్లాలో పలు మండలాల్లో భానుడు భగభగమని మండాడు. రోహిణీ కార్తెకు 15 రోజుల ముందే ఎండ తీవ్రత పెరిగింది. ఆదివారం నుంచి కృతిక కార్తె ప్రారంభం కావడంతో ఆ ప్రభావం స్పష్టంగా కనిపించింది. ఉదయం నుంచే భానుడు భగభగలాడటంతో మధ్యాహ్నం వేళ వాతావరణంలో సెగలుగక్కాయి. గుంటూరు జిల్లాలో ఈ వేసవిలో తొలిసారిగా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌ని దాటాయి. పల్నాడు జిల్లాలో అచ్చంపేట, కారంపూడి, క్రోసూరు, నరసరావుపేటలో 41 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. నాదెండ్ల, అమరావతి, మాచర్లలో 40 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. ప్రత్తిపాడు మండలంలో 36.9 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. సోమవారం నుంచి అన్ని మండలాల్లో 43 డిగ్రీలు, మంగళవారం 44 డిగ్రీల సెల్సియస్‌ని దాటి నమోదవుతాయని పేర్కొన్నది.



శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీసమేత శ్రీక్షీరభావన్నారాయణస్వామి దేవాలయం

## బాపట్ల ఇలవేల్పు.. భావన్నారాయణస్వామి

### నేడు రథోత్సవం



శ్రీభావన్నారాయణస్వామి

బాపట్ల, మే11 (ఆంధ్రజ్యోతి) : బాపట్లలోని భావన్నారాయణస్వామి దేవాలయం భారతదేశంలోని ప్రాచీన వైష్ణవ క్షేత్రాలలో ఒకటి. ఇది సుమారు 1432 సంవత్సరాలకు పూర్వం చోళులచే నిర్మితమైనది. భావన్నారాయణస్వామి పేరిట ఈ ఊరికి భావపురి అనే పేరు వచ్చింది. కాలానుగుణంగా ఆపేరు రూపాంతరం చెంది భావపట్లగా, బాపట్లగా మారింది. ప్రతి సంవత్సరం వేసవికాలంలో వైశాఖమాసంలో వైభవంగా జరిగే తిరునాళ్ళ బ్రహ్మోత్సవాలకు లక్షల సంఖ్యలో భక్తులు విచ్చేస్తుంటారు.

శ్రీ భావదేవుని 1432వ నవాహ్నిక వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం తెల్లవారుజామున శ్రీవారి కళ్యాణ మహోత్సవం జరుగుతుంది. ఉదయం గరుడోత్సవం, సాయంత్రం స్వామివారి రథోత్సవం (బావయ్యపౌర్ణమి) నిర్వహించేందుకు పెద్దఎత్తున ఏర్పాట్లుచేశారు. రథోత్సవం రోజు జరిగే తిరునాళ్ళ మహోత్సవానికి పరిసరప్రాంత ప్రజలతోపాటు దూరప్రాంతాల నుంచి కూడా భక్తజనం విశేష సంఖ్యలో తరలి వస్తారు. కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్సీ బీజేపీనాయకులు అన్నం సతీష్ ప్రభాకర్ ఆధ్వర్యంలో శ్రీ భావపురి అయ్యప్ప సేవాసంఘం ద్వారా ఉదయం అన్నసంతర్పణ ఏర్పాటు చేస్తున్నారు.

### రథోత్సవానికి ప్రముఖులు రాక

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరగుతున్న మొదటి శ్రీ క్షీరభావన్నారాయణ స్వామి రథోత్సవానికి మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, బాపట్ల పార్లమెంట్ సభ్యుడు తెన్నేటి కృష్ణప్రసాద్,బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళి ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని బాపట్ల శాసన సభ్యుడు వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. నేడు జరిగే రథోత్సవానికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# సేవకు ప్రతిరూపం

❖ వైద్య రంగంలో నర్సులది కీలక పాత్ర ❖ నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



సత్తెనపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి) : వైద్య రంగంలో కీలక మైన నర్సు వృత్తికి గౌరవాన్ని, హుందాతనాన్ని తీసుకు వచ్చిన ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టిన రోజు సందర్భంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని మే 12న ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏటా నిర్వహిస్తారు. ప్రజల ఆరోగ్య రక్షణలో నర్సులు అందించే తోడ్పాటును ఈ రోజున గుర్తు చేసుకుంటారు. ప్రజల ఆరో గ్య రక్షణలో నర్సులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయక రోగులకు సేవలు అందిస్తారు. ప్రజల ఆరోగ్యాన్ని మెరుగు ప రచటం, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించటం, ఆర్థిక వృద్ధికి మద్దతు వంటి ప్రభావాలను నర్సింగ్ ద్వారా సాధించవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. ప్రస్తుతం నర్సులు అంటు వ్యాధులు అనే మహమ్మారితో పోరాడటంలో ముందంజలో ఉన్నారు. వారు నాణ్యత, గౌరవప్రదమైన చికిత్స సంరక్షణను రోగులకు అందిస్తారు. కోవిడ్ మహమ్మారి సమయంలో నర్సులు పోషించిన పాత్ర కీలకం. అందించిన సేవలు ప్రపం చ ప్రజలందరికీ తెలుసు. నర్సులు, ఇతర ఆరోగ్య కార్యకర్తలు లేకుండా సార్వత్రిక ఆరోగ్యాన్ని ఆ దేశాలు సాధించ లేవు. అలాగే నర్సులు ఆరోగ్య కార్యకర్తలందరికీ వృత్తి పరమైన భద్రత, ఆరోగ్యం, ముఖ్యంగా వ్యక్తిగత రక్షణ పరికరాలకు అంతరాయం లేకుండా సురక్షితంగా సంరక్షణతోనే ఉంటేనే రోగులకు సేవలు అందించగలరు. ఆస్పత్రిలో చేరిన రోగులకు వారి శారీరక అవసరాలు నిర్వహించటానికి, ఆరోగ్య పరిస్థితు లకు అనుగుణంగా చికిత్స చేయటానికి నర్సులు ముఖ్యమైన పాత్ర పోషిస్తారు. నర్సుల దినోత్సవం రోజు నర్సింగ్ విభాగం లో దేశ వ్యాప్తంగా విశేష సేవలు అందించిన నర్సులకు రాష్ట్రపతి, నేషనల్, ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డును అందిస్తారు.

## నర్సు వృత్తి ఆవిర్భావానికి ప్రతీక.. నైటింగేల్ పుట్టిన రోజు

**ఎస్‌కే బంగారు పాప**
**హెడ్ నర్సు, ఏరియా వైద్యశాల, సత్తెనపల్లి**



నర్సు వృత్తి ఆవిర్భావానికి వృత్తి గౌరవానికి ప్రతీక ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టిన రోజు. ఆమె చేసిన త్యాగానికి ఫలితంగా నర్సు వృత్తి అనేది వైద్య రంగానికి వన్నె తెచ్చింది. ప్రపంచంలోని మొత్తం ఆరోగ్య కార్యకర్తల్లో సగానికి పైగా నర్సులు ఉన్నారు. అయినప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా నర్సుల కొరత ఉంది. రోగుల సంరక్షణ, చేసే పని శారీరక, మానసిక సవాలుతో కూడిన వృత్తి.

## రోగులకు సేవతో అధిక సంతృప్తి

**-ఆదిలక్ష్మి, స్టాఫ్ నర్సు, ఏరియా వైద్యశాల, సత్తెనపల్లి**



రోగులకు సేవలు అందించటం అధిక సంతృప్తినిస్తుంది. రోగుల సంరక్షణ, సమర్థవంతమైన సేవలను అందిస్తున్నాం. నర్సు వృత్తి నిస్వార్థమైంది. సమాజంలో నర్సులు పోషించే పాత్ర ఎంతో ముఖ్యమైనది.

## పుట్టుక నుంచి జీవితాంతం వరకు..

**-జ్యోతి, స్టాఫ్ నర్సు, ఏరియా వైద్యశాల, సత్తెనపల్లి**



వైద్యశాలల్లో పని చేసే నర్సుల పాత్ర మనిషి పుట్టుక నుంచి జీవితాంతం వరకు సంరక్షణ, ప్రత్యక్ష రోగి సంరక్ష ణ, కేసు నిర్వహణ ఉంటుంది. జీవితం లో సమయం, శక్తిలో ఎక్కువ భాగా న్ని రోగుల కోసం కేటాయిస్తాము.

# మురళీనాయక్‌ది వీరమరణం

◆ యావత్ దేశం ఆయనను గుర్తించుకుంటుంది ◆ మంత్రి అనగాని

రేపల్లె, మే 11 (ఆంధ్రజ్యోతి): భారత సరిహద్దుల్లో దేశరక్షణకోసం ప్రాణాలు తెగించి పోరాటం చేస్తూ వీరమరణం పొందిన మురళీనాయక్ త్యాగం వృథాగా పోదని రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఆదివారం సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కళ్లితండాకు చెందిన వీరజవాన్ మురళీనాయక్ భౌతిక



మురళీనాయక్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

కాయం వద్ద మంత్రులు అనగాని సత్యప్రసాద్, నారా లోకేశ్, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మీబిడ్డ దేశం కోసం ధైర్యసాహసాలతో పోరాటం చేస్తూ మృతిచెందటం బాధాకరమైనా దేశం గర్వించదగ్గ సైనికుడిలా నిలిచిపోతారని తెలిపారు. ప్రభుత్వం అన్నివిధాలా మురళీనాయక్ కుటుంబాన్ని ఆదుకుంటుందని ఈ సందర్భంగా హామీనిచ్చారు.

## సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 11 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 513.30 అడుగులు ఉంది. ఇది 137.34 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

# తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్

● విగ్రహావిష్కరణలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

అమరావతి, మే 11 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకగా స్వర్గీయ నందమూరి తారకరామారావు నిలుస్తారని ఎంపీ, టీడీపీ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. మండలంలోని ఎండ్రాయి గ్రామంలో నిర్మించిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పార్టీని ఏర్పాటు చేసి తొమ్మిది నెలల్లో అధికారం చేపట్టిన ఘనత ఎన్టీఆర్‌దేనన్నారు. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళలకు గుర్తింపును తీసుకువచ్చి రాజకీయ చైతన్యాన్ని, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారన్నారు. ఆయన అడుగుజాడల్లో చంద్రబాబునాయుడు రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ రాజకీయ రంగానికి నూతన ఒరవడి తీసుకువచ్చి డాక్టర్లు, లాయర్లు, అధ్యాపకులను రాజకీయాల్లోకి తీసుకువచ్చి ఆదర్శంగా నిలిచారన్నారు. చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మాట్లాడుతూ జాతీయస్థాయిలో తెలుగు వారి సత్తా చాటిన మహానేత ఎన్టీఆర్ అన్నారు. కార్యక్రమంలో సంగం డెయిరీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

డైరెక్టర్ వలివేటి ధర్మారావు, టీడీపీ నాయకులు వెన్నా సాంబశివారెడ్డి, పఠాన్ నూర్జహాన్, నూతలపాటి రామారావు, కంచర్ల శివరామయ్య, పార్టీ మండల, గ్రామ అధ్యక్షులు మల్లాది విష్ణు, జాన్‌సైదా, మాజీ సర్పంచ్ జమ్ముల రవికుమార్ తదితరలు పాల్గొన్నారు.

# ఏషియన్ ఉమన్ పవర్ లిఫ్టింగ్‌లో సబీనాకు నాలుగు బంగారు పతకాలు



షేక్ సబీనా

మంగళగిరి, మే 11, (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రా డూన్‌లో జరుగుతున్న ఏషియన్ జూనియర్ ఎక్విప్డ్ ఉమన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారతదేశం తరపున పాల్గొన్న తెనాలి వాసి మంగళగిరి ఫిట్ జోన్ జిమ్‌లో అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ కోచ్ షేక్ సంధాని వద్ద శిక్షణ పొందుతున్న సబీనా 84 కేజీల కేటగిరిలో పాల్గొని నాలుగు బంగారు పతకాలు సాధించారని గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కే విజయభాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని ఆదివారం తెలిపారు. స్కాట్ 190 కేజీలు, బెంచ్ ప్రెస్ 85 కేజీలు, డెడ్ లిఫ్ట్ 180 కేజీలు, ఓవరాల్ 455 కేజీలు బరువులు ఎత్తి నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. గోల్డ్ మెడల్ సాధించిన సబీనాను, కోచ్ సంధానిని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ చైర్మన్ ఆర్యన్ వంశీకృష్ణ, సౌత్ ఇండియా, ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, అధ్యక్షులు గంటా వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షులు మద్ది ప్రభాకర్, మంత్రులు నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, గుంటూరు మేయర్ కే రవీంద్ర, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులు, పలువురు ప్రముఖులు అభినందించినట్టు తెలిపారు.

## కృష్ణానదిలో మునిగి వ్యక్తి మృతి



షేక్ బాజీ (ఫైల్‌ఫొటో)

కొల్లిపర, మే 11 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానదిలో స్నానానికి దిగి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం తెనాలి చెంచుపేటకు చెందిన షేక్ బాజీ (25) తన కుటుంబ సభ్యులు పది మందితో కలిసి ఆదివారం సరదాగా కొల్లిపర సమీపంలోని కృష్ణానదికి వచ్చారు. మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం షేక్ బాజీ నదిలో ఈత వేయటానికి వెళ్లి ప్రమాదవశాత్తు మునిగి పోయాడు. కుటుంబ సభ్యులు తహసీల్దార్ సిద్ధార్థకు, ఎస్ఐ కోటేశ్వరరావుకు సమాచారాన్ని అందజేశారు. తహసీల్దార్ సిద్ధార్థ, ఎస్ఐ కోటేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బాజీ మృతదేహం లభ్యం కావటంతో ఎస్ఐ కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు బాజీకి వివాహం అయ్యి రెండు సంవత్సరాలు కావస్తుంది.

# పీఆర్కే.. రాజకీయ సన్యాసం ఎప్పుడు

రెంటచింతల, మే 11 (ఆంధ్రజ్యోతి) : నాడు పశర్లపాడు తిరునాళ్లకు వస్తుంటే శాంతిభద్రతల నెపంతో రెంటచింతలలో గంటల కొద్ది నిలిపి వేయించావ్.. మా పార్టీ వాళ్ల విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేస్తుంటే అడ్డుతగిలావు. అయినా నేను గ్రామంలోకి వచ్చి ఆలయానికి వెళ్లా.. నన్ను మా పార్టీ నేతలను కార్యకర్తలను ఎంతగా హింసించావో.. జాగ్రత్త.. సినిమా వేరే విధంగా ఉండబోతుంది. వరికపూడిశెల ప్రాజెక్టు తీసుకురాకపోతే రాజకీయ సన్యాసం చేస్తానన్న మాజీ ఎమ్మెల్యే పీఆర్కే రాజకీయాల నుంచి ఎప్పుడు తప్పుకుంటారో స్పష్టం చేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి డిమాండ్ చేశారు.పశర్లపాడు గ్రామ తిరునాళ్ల సందర్భంగా బ్రహ్మంగారి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం విద్యుత్ ప్రభపై నుంచి ఎమ్మెల్యే ఉద్రేకంగా మాట్లాడారు. మాది మీ లాగా మాట తప్పే వంశం కాదు.. ప్రజల్ని జలగల్లా పీడించలేం.వారి ఉసురుపోసుకోలేం.... కులాల మధ్య మతాల మధ్య చిచ్చుపెట్టలేం..11 నెలల నుంచి మాచర్ల ప్రశాంతంగా ఉంటున్న సమయంలో నీ రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసం విభజన రాజకీయాలు చేయొద్దని ఎమ్మెల్యే హితవు పలికారు. మహిళల మంగళహారతులతో నుదుట తిలకం దిద్ది ఎమ్మెల్యేను ఆలయంలోకి తోడ్కొని వెళ్లారు..ఈ కార్యక్రమంలో మాజీ డీసీ చైర్మన్ నల్లబిరుదు నరసింహారావు,

**ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి**



పశర్లపాడు తిరునాళ్ల వేదికపై నుంచి మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

కుర్రి శివారెడ్డి, కావూరి నాగయ్య,దొండపాటి శివనాగు,నాగార్జున,మాజీ సర్పంచ్ వెంకట నారాయణ,సాగు నీటి సంఘ చైర్మన్ హనుమంతరావు,జమ్మిగుంపుల వెంకటేశ్వరరావు,టీడీపీ మండల అధ్యక్షులు అబ్బిరెడ్డి, ప్రభురాజు,నీలం మల్లయ్య,పోట్ల సతీష్,మాధవరావు,అల్లం బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పురుగుమందు తాగి వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న వెదుళ్లపల్లి ఎస్ఐ భాగ్యరాజ్

బాపట్లరూరల్, మే11 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆ దివారం చోటు చేసుకుంది. వెదుళ్లపల్లి ఎస్ఐ భాగ్యరాజ్ తెలిపిన వివరాల ప్రకారం వెదుళ్లపల్లి గవినివారిపాలెం రోడ్డులో కుందేరువాగు సమీపంలోని ప్రహరీ గోడ వద్ద ఓ వ్యక్తి మృతదేహం లభ్యమవ్వటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి ఎస్ఐ భాగ్యరాజ్ వెదుళ్లపల్లి వీఆర్వోతో కలిసి మృతదేహాన్ని పరిశీలించటం జరిగింది. మృతదేహం పక్కనే పురుగుల మందు బాటిల్ ఉన్నది. మృతుడు బాపట్ల మండ లం దరివాదకొత్తపాలెంకు చెందిన భోగిరెడ్డి శేషరెడ్డి (44)గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియావైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

**నెక్ సూచించిన కోడిగుడ్ల ధర**

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

**బ్రాయిలర్ ధరలు**

**అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్**

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ (కిలో) | 133, 142, 153 |
| చికెన్ విత్ స్కిన్(కిలో) | 254.00 |
| చికెన్ స్కిన్ లెస్(కిలో) | 264.00 |

# సూర్యలంకలో పర్యాటకుల సందడి

బాపట్లరూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వపర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న బాపట్ల సూర్యలంక సముద్రతీరానికి పర్యాటకుల రాక పెరిగింది. వేసవికాలం ఎండల తీవ్రత పెరగటం, ఉక్కపోత ఎక్కువగా ఉండటం వలన ప్రజలు ఉపశమనం కోసం సూర్యలంకకు అధిక సంఖ్యలో ఆదివారం తరలివచ్చారు. హైదరాబాద్, విజయవాడ, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు తీరంకు కారులలో వచ్చి కుటుంబసమేతంగా స్నానాలను చేసి ఆనందంగా గడిపారు. చిన్నారులు తీరం ఒడ్డున ఆడుకున్నారు. యువకులు తీరంలో కేరింతలు కొడుతూ స్నానాలు చేశారు. తీరం సమీపంలోని జీడితోటల కింద వనభోజనాలు చేస్తూ ఆనందంగా గడిపారు. పర్యాటకుల రాకపెరగటంతో రూరల్, మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్ళు ముమ్మర గస్తీ నిర్వహించారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో తీరం ఒడ్డున వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. పరీక్షలు ముగియటంతో రానున్న రోజుల్లో సూర్యలంకకు మరింతగా పర్యాటకుల రాక పెరిగే అవకాశం ఉంది.



సూర్యలంక తీరంలో స్నానాలు ఆచరిస్తున్న పర్యాటకులు

# 'జనరల్ బోగీలు'కు ప్రథమ బహుమతి



ప్రథమ బహుమతి అందుకుంటున్న జనరల్ బోగీలు దర్శకుడు గోపరాజు విజయ్

పొన్నూరు టౌన్, మే,11 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన 24వ ఉభయ తెలుగురాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటికల పోటీల్లో జనరల్ బోగీలు అనే నాటిక ప్రథమ బహుమతిని అందుకుంది. శనివారం రాత్రి నాటికల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రైలు ప్రమాదాల్లో కుమారుడుని కోల్పోయి, కుమారుడి ఆచూకీ కోసం న్యాయపోరాటం చేసిన మాతృమూర్తి కథాంశంతో సాగిన జనరల్ బోగీలు నాటిక, ఆహూతులతో పాటు న్యాయనిర్ణేతల ప్రశంసలు అందుకుంది. ఈ నాటికకు ప్రథమ బహుమతి లభించగా, దర్శకుడు గోపరాజు విజయ్‌కు బహుమతిని ప్రదానం చేశారు. అసత్యం నాటిక ద్వితీయ బహుమతిని, చిగురుమేఘం నాటిక తృతీయ బహుమతిని అందుకుంది. నాటికల పోటీలను కళాపరిషత్ అధ్యక్షుడు ఎస్ ఆంజనేయులునాయుడు, గౌరవాధ్యక్షుడు ఆకుల సాంబశివరావు పర్యవేక్షించారు.

## పోలవరం, అమరావతిని పూర్తిచేయడమే సీఎం లక్ష్యం

టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి



కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): పోలవరం, అమరావతిని పూర్తిచేయడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు అహర్నిశలు కష్టపడుతున్నారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాల పాటి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత పాలకుల పాపాలు సరిచేస్తూనే చంద్రబాబు ప్రజల కోసం శ్రమిస్తున్నారని అన్నారు. మరలా జగనమోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చి ఉంటే ప్రజల ఆస్తులు, భూములు కోల్పోయేవారన్నారు. కష్టాలు, సమస్యలు ఉన్నప్పటికి వాటిని అధిగమిస్తూనే ప్రభుత్వ పథకాలు, విధానాలపై వివిధ శాఖల అధికారులు ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నారని అన్నారు. నెలరోజుల వ్యవధిలోనే కొత్త రేషన్ కార్డులు, అన్నదాత సుఖీభవ, తల్లికివందనం, పథకాలను కూటమి ప్రభుత్వం ప్రారంభించబోతుందన్నారు.

# బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



# అన్ని వర్గాలతో గ్రామ కమిటీలు ఏర్పాటు

● ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : అన్ని వర్గాల వారితో గ్రామ కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. కొల్లూరులోని ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్‌లో ఆదివారం మండల టీడీపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా గ్రామ కమిటీలు నియమించడం జరుగుతుందని, గ్రామ కమిటీల్లో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ, ఓసీలు సభ్యులుగా ఉంటారన్నారు. కెఎస్ఎస్ సభ్యులుగా ఉన్న వారు మాత్రమే పార్టీపరంగా, ప్రభుత్వపరంగా పదవులు వరిస్తాయన్నారు. ఎన్నికలకు ముందే కుటుంబ సాధికారత సారధులను నియమించుకోవడం జరిగిందన్నారు. వీరంతా ప్రతి 30 కుటుంబాలకు ప్రాతినిధ్యం వహించారని, అలాంటి వారికి ప్రాధాన్యత ఇవ్వాలన్నదే ముఖ్యమంత్రి సంకల్పంగా తెలిపారు. వివాదాలు, విభేదాలు లేకుండా కమిటీల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. నూతనంగా బూత్ కన్వీనర్‌లు, కో-కన్వీనర్లను నియమించడం జరుగుతుందన్నారు. సమావేశంలో రేపల్లె మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకట సుబ్బయ్య, మండల పార్టీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, డీసీ అధ్యక్షులు యలవర్తి కోటేశ్వరరావు, పార్టీ నాయకులు నాగశ్రీధర్, మేకా దివాకర్, పెదపూడి నాగరాజు, గాదె చంటి, యడ్ల శ్రీనివాస్, మండల గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కొల్లూరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ధాన్యం ఇవ్వడం జరుగుతోందని, అదే విధంగా గ్రామ స్థాయి కార్యవర్గం ఎంపికలో పది మంది సభ్యులు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు, అలాగే మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసుకునే కమిటీల ద్వారా నామినేటెడ్ పదవులకు అవకాశం ఏర్పడుతుందన్నారు. పని చేయని కన్వీనర్లను గుర్తించి వారి స్థానంలో ఉత్సాహవంతులైన వారిని ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు శివారెడ్డి, ఎల్లారెడ్డి, వీఎస్‌కే ప్రసాద్, కాపూరు శ్రీను, శరత్‌చంద్ర పాల్గొన్నారు.

## సంస్థాగత ఎన్నికలు త్వరగా పూర్తి చేయాలి

చుండూరు (వేమూరు), మే 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని మరింత పటిష్టపరిచేందుకు మంత్రి లోకేశ్ నాయకత్వంలో కృషి జరుగుతోందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. మండల కేంద్రమైన చుండూరులోని బాబు కల్యాణ మండపంలో ఆదివారం మండల స్థాయి పార్టీ సమావేశం నిర్వహించారు. హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలోని గ్రామాల్లో ఇంతవరకు పార్టీ సభ్యత్వ నమోదుతో పాటు ఓవర్ లిస్ట్ ఆధారంగా కుటుంబ సాధికార సారధులను ఏర్పాటు చేసే విషయంలో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పని చేశారన్నారు. ప్రతి విభాగంలోనూ మహిళలక ప్రా

## కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు అందజేత

కొల్లూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదంలో మృతి చెందిన కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కును ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆదివారం అందజేశారు. కొల్లూరు ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్‌లో తోకలవానిపాలెం గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త కొమరబత్తిని తేజ ప్రమాదవశాత్తు మృతి చెందడంతో పార్టీ సభ్యత్వం కలిగి ఉండటంతో రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యకర్తలకు పూర్తి భరోసా కల్పించేది, అండగా నిలిచేది టీడీపీయేనని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ మైనేని మురళీకృష్ణ పాల్గొన్నారు.

## నూతన రథానికి సంప్రోక్షణ

బాపట్ల, మే 11 (ఆంధ్రజ్యోతి) : శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీ క్షీర భావన్నారాయణస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా నూతనంగా నిర్మించిన రథానికి ఆదివారం సంప్రోక్షణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, సతీమణి హరికుమారి దంపతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సోమవారం నిర్వహించే రథోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులుకావాలన్నారు.


నూతన రథానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ, హరికుమారి దంపతులు

## ఘనంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలు


శ్రీలక్ష్మీ నరసింహస్వామి

పిట్టలవానిపాలెం, మే11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్లూరు గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి జయంతి సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎం.వి.ఎస్.వర్మ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి 7 గంటలకు ఆలయ ప్రధానార్చకులు స్వామివారికి ఘనంగా కల్యాణం నిర్వహించారు. అదేవిధంగా ఉదయం 8 గంటల నుండి భక్తులు స్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో స్వామికి భజన కార్యక్రమాలను ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు. మండలంలోని ఖాజీపాలెం, అల్లూరు, అలకాపురం తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలు విచ్చేశారు.

## శ్రీ పోలేరమ్మతల్లి ప్రభ ఊరేగింపు

బాపట్ల, మే 11 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణం భీమావారిపాలెంలో బాపట్ల గ్రామదేవత శ్రీపోలేరమ్మ తల్లికి ఆదివారం చద్ది నైవేద్యం సమర్పించే సందర్భంగా ప్రభ ఊరేగింపు ఉత్సవాన్ని మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ ప్రారంభించారు. ఈ ఉత్సవంలో గ్రామపెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులను చెల్లించుకున్నారు.


ప్రభ ఊరేగింపును ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్

## శ్రీ బగళాముఖి అమ్మవారికి ప్రత్యేక పూజలు

పిట్టలవానిపాలెం, మే11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, మొక్కుబడులు తీర్చుకున్నారని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసినట్లు చెప్పారు.


శ్రీబగళాముఖి అమ్మవారు

## ఆహ్వానం లేకపోయినా ఉత్సవంలో పాల్గొంటా

● మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి


మాట్లాడుతున్న కోన రఘుపతి

బాపట్ల, మే11 (ఆంధ్రజ్యోతి) : శ్రీభావన్నారాయణస్వామి రథోత్సవానికి ఆహ్వానం లేకపోయినప్పటికి ఉత్సవంలో పాల్గొంటామని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు కోన రఘుపతి స్పష్టం చేశారు. ఈ విషయమై ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్సవానికి ఆహ్వానించకపోవటాన్ని వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. పదేళ్ళపాటు ఎమ్మెల్యేగా చేసి భావన్నారాయణస్వామి దేవాలయాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేశామన్నారు. ఆలయ కమిటీ నిర్వహణలోనే రథ నిర్మాణం జరిగిందని, ప్రతి రూపాయికి లెక్కలు ఉన్నాయని కోన చెప్పారు. కమిటీ చైర్మన్ సత్యనారాయణ చనిపోవటంతో లెక్కలు చూపటంలో కొద్దిగా ఆలస్యమైందన్నారు. ప్రతి రూపాయి బ్యాంక్ ఖాతా నుంచే చెల్లించినట్లు తెలిపారు. దేవాలయాభివృద్ధికి సంబంధించి దాతలిచ్చిన డబ్బుల లెక్కలు పక్షంరోజుల్లో చూపుతామని చెప్పారు. లెక్కలకు సంబంధించిన వివరాలు కావాలంటే నేరుగా కలిసి అడిగితే చెబుతామని రాజకీయ లబ్ధి కోసం విమర్శలు చేయటం మానుకోవాలన్నారు. సమావేశంలో వైసీపీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మరుప్రోలు ఏడుకొండలురెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, జోగి రాజా, చింతల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## రెడీమెడ్ కాంక్రీట్ ప్లాంట్ ప్రారంభం

బాపట్ల రూరల్, మే11 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం పోతురాజు కొత్తపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన రెడీమెడ్ కాంక్రీట్ ప్లాంట్‌ను ఆదివారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ప్రారంభించారు. ఇటువంటి గ్రామ ప్రాంతంలో ప్లాంట్ నిర్మించటం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు దొరకుతాయని సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల మార్కెట్ యార్డు చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, పార్టీనాయకులు పాల్గొన్నారు.

## సైనికులకు మద్దతుగా సంఘీభావ ర్యాలీ

చెరుకుపల్లి, మే 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కామినేనివారిపాలెంలో భారతసైన్యానికి మద్దతుగా గ్రామస్థులు, విద్యార్థులు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యుద్ధంలో అమరుడైన మురళీనాయక్‌కు నివాళులర్పించారు. ఈ ర్యాలీలో ఆపరేషన్ సిందూర్ జయహో, మురళీనాయక్ అమర్‌రహే, భారత్‌మాతాకీ జై అంటూ వీధులలో జాతీయ జెండాలు, ప్లెక్సీలతో నినాదాలు చేశారు. ఈసందర్భంగా గ్రామస్థుడు గుర్రం మురళీమోహన్ మాట్లాడుతూ ఇప్పటికే పాకిస్తాన్ మూడు యుద్ధాలలో ఓడిపోయినప్పటికి ఇంకా బుద్ధిరాలేదని, ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్నారని దానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి శ్రీనివాసరావు, పీటా నాగరాజు, బొలగాని రామారావు, పీటా శ్రీనివాసరావు, కామినేని పెద నాంచారయ్య, బొలగాని శ్రీనివాసరావు, కామినేని మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న గ్రామస్థులు, స్కూల్ విద్యార్థులు

## మురళీనాయక్‌కు ఘన నివాళులు

కొల్లూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : పాకిస్తాన్‌తో చేస్తున్న యుద్ధభూమిలో అమరుడైన మురళీనాయక్‌కు ఆదివారం సుగాలి యూత్ సభ్యులు ఘన నివాళులర్పించారు. కొల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని బోసునగర్ తండాలో మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి దేశం కోసం ప్రాణాలు అర్పించిన మా బంజారా బిడ్డ అంటూ తండావాసులు నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో జగదీష్ నాయక్, బద్రి, మణికంఠ, దుర్గా, గోపి, యశ్వంత్ నాయక్, పృధ్వీనాయక్, మురళీనాయక్ తదితరులు పాల్గొన్నారు.


వీర మరణం పొందిన మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న బోసునగర్ వాసులు

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె, మే 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 33 కేవీ విద్యుత్‌లైన్లు అత్యవసర మరమ్మతుల కారణంగా రేపల్లె పట్టణం, రేపల్లె రూరల్ మండలంలోని అన్ని గ్రామాలకు సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నదని విద్యుత్ ఏడీఈ ఎ.శ్యామ్‌సుధాకర్‌బాబు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## శ్రీనివాసరావు సేవలు చిరస్మరణీయం : యూటీఎఫ్

కర్లపాలెం, మే11 (ఆంధ్రజ్యోతి) : వృత్తికి వన్నెతెచ్చిన ఒక మంచి ఉపాధ్యాయుడు తాడికొండ శ్రీనివాసరావు అని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి ఎం.వెంకటేశ్వరరెడ్డి అన్నారు. కర్లపాలెం యూటీఎఫ్ కార్యాలయంలో శ్రీనివాసరావు మాస్టర్ నాల్గోవ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన చిత్రపటానికి యూటీఎఫ్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి వైవీ నారాయణ అక్కడ జరిగిన సభకు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రతినిధులు సీహెచ్ ప్రభాకర్, వి.రాఘవేంద్ర, సీహెచ్ అజయ్‌కుమార్, పోలీసురావు, డి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.


తాడికొండ శ్రీనివాసరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

## సిగిరెట్ వద్దని చెప్పిన వారిపై దాడికి యత్నం

బాపట్ల, మే11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో కూల్‌డ్రింక్ షాపు దగ్గర ఆదివారం మధ్యాహ్నం ఇరువురు వ్యక్తులు సిగిరెట్‌లు కాల్చుతుండగా పబ్లిక్ వచ్చేచోట సిగిరెట్‌లు కాల్చవద్దని చెప్పినందుకు దాడికి యత్నించారు. దుకాణంలోని ట్రేలను బయటకు విసిరి సదరు నిర్వాహకులపై దాడి చేయబోయాడు. ఇదేమిటని ప్రశ్నిస్తే గుంటూరులో అధికార పార్టీ నాయకుడు మా అన్న. మీ ఇష్టం వచ్చినట్లు చెబితే కుదరదంటూ వీరంగం చేశాడు. చివరకు షాపు యాజమాని వచ్చి ఆగ్రహించటంతో వెళ్ళిపోయారు.

## బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో పోలీసుల తనిఖీలు

రేపల్లె, మే 11(ఆంధ్రజ్యోతి) : దేశంలో యుద్ధ పరిణామాలు నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానిత వ్యక్తులు కనిపించిన యెడల పోలీసులకు సమాచారం ఇవ్వాలని పట్టణ ఎస్‌ఐ రాజశేఖర్ అన్నారు. రైల్వేస్టేషన్, బస్టాండ్ ప్రధాన కూడలిలో డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనుమానిత వ్యక్తులు ఎవరినైనా గుర్తించిన యెడల తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


రేపల్లె బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది

## జగన్మోహిని అవతారంలో స్వామివారి ఊరేగింపు

బాపట్ల, మే11 (ఆంధ్రజ్యోతి) : శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీక్షీరభావన్నారాయణస్వామి 1432వ నవాహ్నిక వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం స్వామివారు జగన్మోహిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని ప్రత్యేకంగా అలకరించి నగరోత్సవం చేశారు. అదేవిధంగా సాయంత్రం శ్రీ నృసింహ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి 11 గంటలకు ఎదురుకోలోత్సవం జరిపి సోమవారం తెల్లవారుజామున శ్రీవారి కల్యాణమహోత్సవం జరుగుతుందని ఆలయ అర్చకులు శ్రీనివాసుల విఖనసమూర్తి, వినుకొండ సత్యంబాబు, ఆలయ ధర్మకర్త దేశిరాజు వెంకటరమణబాబు తెలిపారు. కార్యక్రమాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.


శ్రీ జగన్మోహిని అవతారంలో ఉన్న శ్రీభావన్నారాయణస్వామిని ఊరేగింపు చేస్తున్న పండితులు

## భావితరాలకు బంగారు భవిష్యత్తును అందించాలి

● ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు


కరదీపికలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ పీసీ సాయిబాబు, విద్యార్థులు

బాపట్ల, మే11 (ఆంధ్రజ్యోతి) : భావితరాల వారికి బంగారు భవిష్యత్తును అందించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో సమాజానికో బహిరంగలేఖ కరదీపికలను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పిల్లలకు పుస్తక పఠనంపై ఆసక్తిని కలిగించి వారిని సరైన మార్గంలో నడిపించటం మనందరి సామాజిక బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో శాఖా గ్రంథాలయాధికారి ఎ.శివాజి గణేశన్, గూడంశెట్టి వెంకటేశ్వర్లు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మధుమేహ వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉండాలి

తెనాలి అర్బన్, మే 11 (ఆంధ్రజ్యోతి) : మధుమేహ వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ వెంకటేష్ చెప్పారు. గాంధీనగర్‌లోని కవిరాజా పార్కులో ఆదివారం వాకర్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు పాలడుగు ఆనందయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మధుమేహ వ్యాధి వలన వచ్చే దీర్ఘ కాల వ్యాధులను అరికట్టడం ఎలా అనే అంశంపై ఆయన ప్రసంగించారు. దీర్ఘకాలంగా టైప్-2 మధుమేహంతో బాధపడే వారిపై ప్రభావం చూపుతుందని, తరచూ పరీక్షలు చేయించుకుంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యాయామం చేయాలని, తద్వారా సమస్య అదుపులో ఉంటుందన్నారు. కార్యదర్శి వీరబాబు, రత్తయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత వైభవంగా శివాలయ పునఃప్రతిష్ఠ

● శివనామస్మరణతో మార్మోగిన గ్రామం

● 7 వేల మందికి అన్నదానం


నూతన ఆలయంలో ప్రతిష్ఠించిన మల్లేశ్వరస్వామి వారు

వేమూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుచ్చెళ్లపాడు గ్రామంలో పునః నిర్మితమైన గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం ఉదయం 6 గంటల 42 నిమిషాలకు అత్యంత వైభవోపేతంగా జరిగింది. శైవ ఆగమ ప్రతిష్ఠాపన ఆచార్య బ్రహ్మశ్రీ పొత్తూరు సత్యనారాయణ, మృత్యుంజయ శర్మ ప్రధాన ఆచార్యత్వంలో జరిగిన ప్రతిష్ఠా కార్యక్రమంలో భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారు, పరివార దేవతలు, ఆంజనేయస్వామి, నవగ్రహాలు, శిఖరములు, జీవధ్వజ స్థంభం, యంత్రములను ప్రతిష్ఠించారు. ప్రతిష్ఠానంతరం మహా కుంబాభిషేకం జరిపారు. పూర్ణాహుతి జరిపి భక్తులకు వేద ఆశీర్వచనం అందించారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో 7 వేల మంది భక్తులు పాల్గొన్నారు. గ్రామస్తులు, ఇతర గ్రామాల నుండి విచ్చేసిన భక్తులు జరిపిన శివనామస్మరణతో గ్రామం మార్మోగింది. ప్రతిష్ఠ అనంతరం లోకహితార్థంగా శాంతి కల్యాణం జరిపారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి, జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు కిలారి రోశయ్య, సోమరౌతు అనురాధ, ఆమంచి సోములు తదితరులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు అతిథులను సత్కరించారు.


ఎమ్మెల్యే ఆనందబాబుకు జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

## మూలమూర్తులకు వెండి వస్తువుల సమర్పణ


వెండి శంఖు చక్రములు, పట్టెడ

వేమూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపని గ్రామానికి చెందిన గాదంశెట్టి సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం ధర్మపత్ని రాజ్యలక్ష్మి వారి కుటుంబ సభ్యులు గ్రామంలో ఉన్న శ్రీ చెన్నకేశవస్వామి వారికి వెండి శంఖు చక్రములు, శ్రీ వీరాంజనేయ స్వామి వారికి వెండి పట్టెడం సమర్పించారు. ఆదివారం ఆగమ శాస్త్ర ప్రకారం అర్చకులు స్వామివార్లకు సమర్పించే వస్తువులకు పంచామృతాలతో శుద్ధి కార్యక్రమం జరిపారు. పంచ సూక్తాలు, మన్యుసూక్తం, సుదర్శన స్తోత్రం, పాంచ జన్య స్తోత్రం పఠించారు. విశేష పూజ అనంతరం దాతలను ఆశీర్వదించారు.

## ఉల్లిపాలెం జడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నగరం, మే 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉల్లిపాలెం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2004-2005 విద్యాసంవత్సరానికి చెందిన పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాత జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ సందడి చేశారు. పాఠశాల అభివృద్ధికోసం ఆర్థికసాయాన్ని అందించటానికి సిద్ధంగా ఉన్నట్లు పూర్వవిద్యార్థులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, సుబ్బారావు, రాజేశ్వరరావు, జానకిదేవి, లక్ష్మీప్రీతి పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

### మంతెనవారిపాలెం జడ్పీ పాఠశాల...

పిట్టలవానిపాలెం, మే 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంతెనవారిపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2000-2001 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులు నాగమునేంద్ర, సాంబశివరావు, ఆర్‌వి.సుబ్బారావు. టి.వెంకట్రావు, సుబ్బరాజు, పరిశా శ్రీనివాసరావు, ఆచార్య రామాంజనేయులవారిని పూర్వవిద్యార్థులు ఆదివారం ఘనంగా సన్మానించారు. పూర్వవిద్యార్థులైన కె.నాగరాజు, ఎన్.శ్రీను, డి.నాగరాజు, భవానీ, అరుణ ఆధ్వర్యంలో పూర్వవిద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో అప్పటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

### చింతాయపాలెం హైస్కూల్...

కర్లపాలెం, మే 11 (ఆంధ్రజ్యోతి) : చింతాయపాలెం హైస్కూల్‌లో చదువుకున్న 1996-1997 బ్యాచ్ 10వ తరగతి పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. దాదాపు 70మంది పూర్వవిద్యార్థులు పాల్గొని 28 సంవత్సరాల తర్వాత తమ బాల్యపు మధురానుభూతులను గుర్తు చేసుకొని పులకరించిపోయారు. 30 వసంతాల సంబరాలకు మరింత మంది విద్యార్థులను సమీకరించి ఘనంగా చేయాలని నిర్ణయించుకున్నారు.


1996-1997 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు

## అనారోగ్యంతో ఆర్మీ జవాను మృతి


సమీబుల్లా (ఫైల్)

చెరుకుపల్లి, మే 11(ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లి మండలం కనగాల గ్రామానికి చెందిన ఆర్మీ జవాను సయ్యద్ సమీబుల్లా(40) ఆదివారం మృతి చెందారు. ఆయన ఏవోసీ బెంగుళూరు యూనిట్‌లో పనిచేస్తున్నారు. ప్రస్తుతం జమ్మూ కాశ్మీర్‌లో విధుల్లో ఉన్నారు. గత నెల 20న సెలవుపై ఇంటికి వచ్చాడు. రెండురోజుల క్రితం అకస్మాత్తుగా అనారోగ్యానికి గురికావడంతో చెరుకుపల్లిలోని ప్రైవేటు హాస్పటల్‌కి తరలించగా పరిస్థితి తీవ్రంగా ఉండటంతో గుంటూరు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆయనకు సైనిక లాంఛనాలతో ఆదివారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి తల్లి, భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. రెండురోజులలో సెలవు నుంచి తిరుగుప్రయాణం చేయవలసి ఉండగా అకస్మాత్తుగా ఇలా జరగడంతో వారి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

## నేడు మంత్రి రవికుమార్ పర్యటన వివరాలు

అద్దంకి, మే11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఉదయం 9 గంటలకు ఏడుగుండ్లపాడు వద్ద హర్షిణి ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ మహిళా కళాశాల ప్రారంభోత్సవం, 10 గంటలకు అద్దంకిలోని శ్రీనగర్‌లో వర్షిక ఆర్థో స్కిన్ అండ్ ట్రామా కేర్ ప్రారంభోత్సవం, 10-30 గంటలకు 5వ వార్డు, 10-45 గంటలకు 19వ వార్డు, 11-30 గంటలకు పంగులూరు మండలం రామకూరు, సాయంత్రం 3 గంటలకు ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయంలో పలు సమావేశంలో రవికుమార్ పాల్గొననున్నారు.

## నేడు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం

అద్దంకిటౌన్, మే 11(ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాలులో జరుగుతుందని ఎంపీడీవో బత్తిన సింగయ్య ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు హజరు కావాలని తెలిపారు.

## 31లోపు కౌలుదారు గుర్తింపు కార్డులు

పంగులూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులు ఈ నెల 31వ తేదీలోగా గుర్తింపు కార్డులు పొందాలని తహసీల్దార్ పి.సింగారావు, ఏవో సుబ్బారెడ్డిలు ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. గుర్తింపు కార్డు పొందేందుకు భూమి యజమాని పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లు, కౌలు రైతు ఆధార్ కార్డ్, కౌలుదారుని బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లతో పాటు, కౌలుదారుని పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, భూ యజమాని మొబైల్ నెంబరుతో సంబంధిత వీఆర్వోని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సీసీఆర్సీ గుర్తింపు కార్డు కలిగిన కౌలు రైతులకు మాత్రమే ప్రభుత్వ రాయితీలు పొందే అవకాశం ఉంటుందని ఏవో సుబ్బారెడ్డి తెలిపారు.

## ఎరుకులకు న్యాయం చేయండి

చీరాల, మే 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఆటోనగర్ భూములు ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉన్నాయని, కొందరు ఉద్దేశపూర్వకంగానే వాటిని ఇతరులకు విక్రయిస్తున్నారని సాల్వేషన్ ఆర్మీ భూముల కమిటీ ప్రతినిధులు ఆరోపించారు. ఆదివారం ఆటోనగర్ వద్ద సమావేశం నిర్వహించారు.

# ఆదివారం ఆధ్యాత్మిక శోభ

### కన్నులపండువగా భీమలింగేశ్వర స్వామి గ్రామోత్సవం

పంగులూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): పంగులూరులోని శ్రీ భీమలింగేశ్వర స్వామి వార్షిక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. శనివారం రాత్రి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచన, పంచగవ్యం దీక్షాధారణ, అఖండస్థాపన, అంకురారోపణ, వాస్తుపూజ, ధ్వజారోహణ కార్యక్రమాలు జరిగాయి. ఆదివారం ఉదయం నిత్యోపాసన, బలిహరణ, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారి కుంకుమార్చన, స్వామిని పెళ్లి కుమారుని చేసే వేడుక, ఆలయ బలిహరణ, గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం రాయబారం, స్వామి దివ్య కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. భక్తులు స్వామివారి కళ్యాణోత్సవాన్ని తిలకించి తరించారు. బ్రహ్మశ్రీ పేటేటి ఉదయభాస్కరశర్మ సారథ్యంలో సాగిన ఈ పూజా కార్యక్రమాలలో వంశపారంపర్య అర్చకులు చందలూరి సునీల్‌కుమార్‌శర్మ, కారంచేటి సాంబశివరావులు పాల్గొనగా, ఆలయ ఈవో శ్రీనివాసరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

### నేడు పౌర్ణమి తిరునాళ్ల మహోత్సవం

భీమలింగేశ్వరస్వామి వార్షిక మహోత్సవం సందర్భంగా సోమవారం పౌర్ణమి తిరునాళ్ల జరగనుంది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో రెండు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 6 గంటలకు నిత్యోపాసన, ఆలయ బలిహరణ, గ్రామోత్సవం అనంతరం అవదూతేంద్ర భక్తమండలి వారి ఏకాహం, రాత్రి ఏడు గంటలకు గండపెండేర గ్రహీత చెన్నుపల్లి నాగేశ్వరరావు శిష్య బృందంచే (54 మంది మహిళలచే) కోలాట ప్రదర్శన జరగనుంది.



చెరుకూరులో ప్రత్యేక అలకరణలో త్రివిక్రమ అగస్త్యేశ్వరస్వామి

### ఘనంగా నృసింహస్వామి జయంతి

చినగంజాం, మే 11(ఆంధ్రజ్యోతి) : స్థానిక భూ సమేత భావనారాయణ స్వామి దేవస్థానంలో నృసింహస్వామి జయంతి వేడుకలను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్వామి జయంతి సందర్భంగా పూజారి మోహన లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామిని సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకించారు. స్వామి విశిష్టత గురించి భక్తులకు వివరించారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వినియోగం చేశారు. ఆలయ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, సేవా దళ్ సభ్యులు జి.పిచ్చయ్య ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు.

### ఘనంగా పోలేరమ్మ తిరునాళ్ల

మండలంలోని కడవకుదురు గ్రామంలో వేంచేసియున్న పోలేరమ్మ తిరునాళ్ల వార్షికోత్సవ పూజలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సీతా లక్ష్మణ్ హనుమత్ సమేత కోదండ రామస్వామి దేవస్థానం ప్రాంగణంలోని మహాలక్ష్మీ అమ్మవారికి వేద పండితులు మాజేటి సాయిరాంశర్మ ఆధ్వర్యంలో మాల్లాది శేఖర బాబు దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తదనంతరం అంకమ్మ తల్లి, పోతురాజు శిల వద్ద పూజలు చేశారు. పూజారి బ్రహ్మయ్య పోలేరమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. నామన లక్ష్మణరావు, బొప్పన పూర్ణచంద్రరావు, గొల్లపూడి సూర్యం, బత్తిన రామస్వామి, నాగిరెడ్డి నాగేశ్వరరావు, గాజుల వెంకటేశ్వర్లు, తోట శ్రీనివాసరావు, సిద్ధాబత్తిన భాస్కర్, సూరగాని రామకృష్ణ పర్యవేక్షించారు.



కడవకుదురులో పోలేరమ్మ

### త్రివిక్రమ అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

పర్చూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలం చెరుకూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ త్రివిక్రమ, అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. స్వామిని వివిధ రకాల పూలతో అలంకరించారు. స్వామి కల్యాణ వేడుకల్లో భాగంగా వారం రోజుల నుంచి ఆలయంలో వివిధ రకాల అభిషేకాలు, పూజాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి బి.నాగయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

### పంగులూరులో...

పంగులూరు, మే 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమూరు గ్రామంలో కుంచాల వంశస్థుల వంశ దేవర రేణుకమ్మ, అంకమ్మతల్లి కొలుపు ఉత్సవం ఆదివారంతో ముగిసింది. శనివారం రాత్రి గ్రామంలో జరిగిన గ్రామోత్సవంలో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన కుంచాల వంశస్థులతో పాటు గ్రామంలోని భక్తులు పాల్గొని సందడి చేశారు. ఆదివారం సాయంత్రం జరిగిన దీన బండారు కార్యక్రమంతో ఉత్సవం ముగిసింది.

# మహాకుంభాభిషేకం కలశయాత్రలో పాల్గొననున్న ఏనుగు

### ఏర్పాట్లను పరిశీలించిన అటవీశాఖ అధికారులు
### 19న గుండ్లకమ్మ నది నుంచి శింగరకొండ వరకు
### వెయ్యి మంది మహిళలతో కలశ పాదయాత్ర

అద్దంకి, మే 11 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం మహాకుంభాభిషేకం సందర్భంగా కలశయాత్రలో పాల్గొనేందుకు ఏనుగు వస్తున్న నేపథ్యంలో శింగరకొండలో ఏర్పాట్లను ఆదివారం అటవీశాఖ అధికారులు, ఈవో తిమ్మానాయుడు పరిశీలించారు. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ నుంచి ప్రత్యేకంగా ఏనుగును తీసుకురానున్నారు. 19వ తేదీ ఉదయం 5 గంటలకు అద్దంకి సమీపంలోని గుండ్లకమ్మ నది నుంచి వెయ్యి మందికి పైగా మహిళలతో కలశ పాదయాత్ర ప్రారంభమై పట్టణంలో గుండా శింగరకొండ వరకు సాగనుంది. కలశపాద యాత్ర ముందు భాగంలో ఏనుగు నడవనుంది. అదే సమయంలో అభిషేకంలో ఏనుగు పాల్గొననుంది. ఈ నేపథ్యంలో 16వ తేదీకి ఏనుగు శింగరకొండ చేరుకొని 20వ తేదీ తిరిగి వెళ్లనుంది. ఈ నేపథ్యంలో విశ్రాంతి తీసుకునేందుకు అవసరమైన ఏర్పాట్లను ఆదివారం చీరాల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమణారావు, వేటపాలెం సెక్షన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, కూకట్లపల్లి బీట్ ఆఫీసర్ రమేష్, ఈవో పరిశీలించారు.

### శింగరకొండ రాతి మండపం నిర్మాణానికి లక్ష రూపాయల విరాళం

అద్దంకి, మే 11 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం రాతి ముఖమండపం పునఃనిర్మాణానికి బొమ్మనంపాడు సర్పంచ్ గోరంట్ల పద్మావతి, శ్రీనివాసరావు దంపతులు ఆదివారం 1,00,116 రూపాయలను ఈవో తిమ్మానాయుడుకు అందజేశారు. బల్లికురవ మండలం కొత్తపాలేనికి చెందిన మాలపాటి పోతురాజు, వెంకటరత్నం దంపతులు ఇటీవల రాతి మండపం నిర్మాణానికి లక్ష రూపాయలు విరాళం అందజేయగా ఆదివారం అన్నదానానికి 4,500 రూపాయలు అందజేశారు. దాతలను ఈవో సత్కరించారు.



విరాళం రసీదును సర్పంచ్ పద్మావతి, శ్రీనివాసరావు దంపతులకు అందజేస్తున్న ఈవో తిమ్మానాయుడు

# భారత జవాన్ల పోరాటం ఎనలేనిది

చీరాల, మే 11 (ఆంధ్రజ్యోతి) : పాక్ ఉగ్రవాదులపై భారత వీర జవాన్లు చేస్తున్న పోరాటం ఎనలేనిదని ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు చెప్పారు. ఆదివారం పట్టణంలో వీర జవానులకు మద్దతుగా సమైక్యత ర్యాలీ నిర్వహించారు. వీర మరణం పొందిన మురళీ నాయక్‌కు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రతినిధులు పోలుదాసు రామకృష్ణ, వెంకటేశ్వరరావు, గురుప్రసాద్, సురేష్, నారాయణమూర్తి, రాఘవరావు, బదిరి, పూర్ణ, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.




చీరాలలో ర్యాలీ నిర్వహిస్తున్న వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

### ప్రత్యేక పూజలు

జాండ్రపేటలో వేంచేసియున్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత నాగలింగేశ్వర స్వామి దేవస్థానంలో ప్రధానీ మోదీ, జవాన్ల యోగక్షేమం కోసం బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మువ్వల వెంకటరమణరావు, బండారుపల్లి హేమంత్ కుమార్, మనోహరరెడ్డి, కాళిక, రఘునాథ్, శైలజ, శివాజీ, వెంకటేశ్వర్లు, రామస్వామి, భరణిరావు పాల్గొన్నారు.

### సంతమాగులూరులో...

సంతమాగులూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలం కామేపల్లిలో అమర వీరుల ఆత్మశాంతి చేకూరాలని క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ డాక్టర్ బొంత స్వర్ణరాజు, సంఘ సభ్యులు లక్కెపోగు బెంజమ్మ, లక్కెపోగు బాబు శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

### అమరవీరునికి నివాళులు

మార్టూరు, మే11 (ఆంధ్రజ్యోతి) : పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధం నేత్రత్వంలో వీరోచితంగా పోరాడి అమరవీరుడైన సైనికుడు మురళీనాయక్ చిత్రపటం వద్ద మార్టూరులో సాయి అపార్టుమెంట్ వాసులు ఘనంగా నివాళులు అర్పించారు. ఆదివారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో జాష్టి కోటయ్య, అపార్ట్‌మెంట్ వాసులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్‌ని పరామర్శించిన టీడీపీ నేతలు

పంగులూరు, మే 11(ఆంధ్రజ్యోతి) :టీడీపీ సీనియర్ నాయకులు, రామకూరు గ్రామ మాజీ సర్పంచ్ మానం సుబ్బారావును మండల నేతలు ఆదివారం పరామర్శించారు. కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఇంటికే పరిమితమై విశ్రాంతి తీసుకుంటున్న సుబ్బారావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గ్రామ ఉప సర్పంచ్ అశోక్‌తో పాటు మండల టీడీపీ అధ్యక్షుడు రావూరి రమేష్, నాయకులు బాలిన రామసుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, ఆదిరెడ్డి, నాగిరెడ్డి, కోమటి ప్రసాద్, శివరాజు, పచ్చాశ్రీను, నారాయణస్వామిలు ఉన్నారు

## నల్ల బర్లీ కొనుగోలుకు చర్యలు చేపట్టాలి

పంగులూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : రైతుల దగ్గర నిల్వ ఉన్న బర్లీ పొగాకు నిల్వలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని రైతు సంఘం ప్రతినిదులు డిమాండ్ చేశారు. ఆదివారం పంగులూరులో రైతుసంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, సీనియర్ నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావులు విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సమక్షంలో కంపెనీ ప్రతినిధులు, రైతు సంఘం నాయకుల మధ్య జరిగిన చర్చల విధి విధానాలు నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. తొలి రెండు ఒలుపుల ఆకును కొనుగోలు చేయకుండా టాప్ ఒలుపుకు సంబంధించిన పొగాకును గ్రేడ్ చేయించి నాణ్యత పేరుతో దానిని మాత్రమే కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. నాణ్యత పేరుతో ఎకరాకు ఒకటి, రెండు క్వింటాళ్లు వచ్చే పొగాకును మాత్రమే కొనుగోలు చేస్తే బర్లీ రైతులు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు.

## ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలి

వేటపాలెం/చీరాల, మే 11 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు నిబంధనలు అనుసరించాలని ఎస్సై వెంకటేశ్వర్లు చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం స్టేషన్ పరిధిలోని పొట్టిసుబ్బాయ పాలెం జంక్షన్‌లో తనిఖీలు నిర్వహించారు. పలు వాహనాల పత్రాలను పరిశీలించారు. అనుమానితుల వివరాలను సేకరించారు. ట్రాఫిక్ విధానాలను వివరించారు. అలాగే వన్‌టౌన్ స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలు జరిగాయి.

## ఏల్చూరు టోల్ ప్లాజా వద్ద పోలీసుల తనిఖీలు



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

సంతమాగులూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): అద్దంకి-నార్కెట్‌పల్లి ప్రధాన రహదారిపై సంతమాగులూరు మండలం ఏల్చూరు టోల్ ప్లాజా వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. సీఐ ప్రభాకర్ పాల్గొన్నారు.

అవీఇవీ

## గుర్తు తెలియని వాహనం ఢీ.. వ్యక్తి మృతి

సంతమాగులూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి - నార్కెట్‌పల్లి ప్రధాన రహదారిపై సంతమాగులూరు మండలం కొమ్మలపాడు గ్రామం వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించాడు. వివరాల్లోకెళ్తే... అద్దంకి పట్టణానికి చెందిన గుంజి రామాంజనేయులను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మృతి చెందాడు.

## బార్ అండ్ రెస్టారెంట్‌లో వాగ్వాదం

### దాడులు చేసుకున్న మందుబాబులు..రాళ్లు సైతం విసిరిన వైనం

చీరాల, మే 11 (ఆంధ్రజ్యోతి) : చీరాల పట్టణంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో మందుబాబులు బీభత్సం సృష్టించారు. ఆదివారం సాయంత్రం బార్ అండ్ రెస్టారెంట్‌లో రెండు వేర్వేరు టేబుల్స్ వద్ద మద్యం సేవిస్తున్న ఇద్దరు యువకులకు ఒక వ్యక్తికి వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో అతను ఇద్దరు యువకులపై తీవ్రంగా దాడిచేశాడు. ఆ తర్వాత యువకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. పది నిమిషాల తరువాత ఆ యువకులు బార్ అండ్ రెస్టారెంట్ వద్దకు చేరుకుని అతనిపై దాడికి దిగారు. అతను ఓ గదిలోకి వెళ్లి తలుపులు వేసుకోవడంతో ఆగ్రహించిన ఇద్దరు యువకులు బార్ మీదకు రాళ్లు రువ్వారు. చాకులు తీసుకుని భవనం చుట్టూ తిరిగారు. ఈ క్రమంలో బార్ నిర్వాహకులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు రావడంతో మందుబాబులు పరుగులు తీశారు. కొంత మందిని పోలీసులు బలవంతంగా అక్కడనుంచి పంపారు. సీసీ కెమెరాల ఆధారంగా దాడులు చేసుకున్న వారి వివరాలను గుర్తిస్తున్నారు.



మందుబాబులను వెనక్కి పంపిస్తున్న పోలీసులు

## జూదరుల అరెస్టు

### రూ.5100 నగదు, 2 కోళ్లు స్వాధీనం

పర్చూరు, మే 11 (ఆంధ్ర జ్యోతి) : పర్చూరు మండలం నూతలపాడులో ఆదివారం కోడి పందాల శిబిరంపై పోలీసులు దాడులు చేశారు. ఒడ్డెరపాలెం సమీపంలో కోడిపందాలు నిర్వహిసున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద రూ.5100 నగదుతోపాటు, రెండు కోడిపుంజులను కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మాల్యాద్రి తెలిపారు.

## ఘనంగా ప్రపంచ మాతృ దినోత్సవం

అద్దంకిటౌన్, మే 11(ఆంధ్రజ్యోతి): బిడ్డల సంరక్షణలో, వారి పురోభివృద్ధిలో తల్లి పాత్ర ఎంతో ఉన్నతమైనదని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో స్థానిక ముస్లిం షాదీ ఖానాలో రోటరీ మాజీ అధ్యక్షుడు హజీ సయ్యద్ మౌలాలి సౌజన్యంతో ప్రపంచ మాతృమూర్తుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరుగురు మాతృమూర్తులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, సెక్రటరీ మురళి సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, మహమ్మద్ రఫీ, దేవపాలన, శ్రీరామచంద్రమూర్తి, చంద్రమౌళి, లేవి ప్రసాద్, శివకుమారి, శ్రీలక్ష్మి, భువనేశ్వరి పాల్గొన్నారు.

## మొక్కు చెల్లించుకున్న ముక్తేశ్వరం టీడీపీ నేత

బల్లికురవ, మే 11 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి వచ్చి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్‌కు మంత్రి పదవి రావాలని ముక్తేశ్వరం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త నాగండ్ల యలమందరావు వేములమ్మ తల్లిని మొక్కుకున్నారు. అనుకున్నవన్నీ జరగటంతో ఆదివారం ముక్తేశ్వరం గ్రామం నుంచి యలమందరావు ఆధ్వర్యంలో 70 మంది టీడీపీ కార్యకర్తలు కోటప్పకొండ వద్ద ఉన్న వేములమ్మతల్లి వద్దకు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు.

## గ్రామస్థుల సహకారంతో శ్మశాన వాటిక అభివృద్ధి

పర్చూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలం నాగులపాలెం గ్రామాభివృద్ధి కోసం గ్రామస్థులు కలసి కట్టుగా ముందుకు సాగారు. అందులో భాగంగా శ్మశానవాటిక అభివృద్ధికి కార్యాచరణ రూపొందించారు. రూ.కోటి వ్యయంతో నిర్మాణం తలపెట్టిన శ్మశాన వాటికకు ఆదివారం శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీమాజీ సభ్యుడు కొల్లా సుభాష్‌బాబు, అడ్డగడ కుప్పయ్య చౌదరి, కొల్లా శ్రీనివాసరావు(ఫ్యాక్టరీ), అడ్డగడ శ్రీనివాసరావు, చాగంటి నాగేశ్వరరావు, సోమేపల్లి వెంకన్న, కొల్లా సుబ్బారావు, కొల్లా నాగేశ్వరావు పాల్గొన్నారు.

## శింగరకొండలో డాక్టర్ లక్ష్మి దంపతుల పూజలు

అద్దంకి,మే11(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీ జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఈవో తిమ్మానాయుడు, వేదపండితులు, పూజారులు ఆశీర్వదించి సత్కరించారు. ముందుగా సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం కూడలిలో తాత దివంగత మంత్రి గొట్టిపాటి హనుమంతరావు విగ్రహానికి లక్ష్మీ, లలిత్ సాగర్ దంపతులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. సంతమాగులూరు ఏఎంసీ చైర్మన్ తేలప్రోలు రమేష్, సనేన్నబోయిన ఏడుకొండలు, గురుయాదవ్, వాసుదేవరెడ్డి, అద్దంకి, దర్శి నియోజకవర్గాలకు చెందిన పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## ముగిసిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు



కప్ అందుకుంటున్న విజేతలు

జాండ్రపేట(చీరాల), మే 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జాండ్రపేట బీవీ అండ్‌బీఎన్ హైస్కూల్లో జరుగుతున్న రాష్ట్రస్థాయి రెడ్ టెన్నిస్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఆదివారం జరిగిన పోరులో డీసీసీ, బీవీ అండ్ బీఎన్ హైస్కూల్‌జట్లు తలపడ్డాయి. డీసీసీ జట్టు నిర్ణీత 12 ఓవర్‌లకు 126పరుగులు చేయగా, బీవీఅండ్‌బీఎన్ జట్టు కూడా 126 పరుగులే చేయడంతో మ్యాచ్ డ్రా అయింది. సూపర్ ఓవర్‌లో డీసీసీ 4 పరుగులు చేయగా. బీవీఅండ్‌బీఎన్ 3 పరుగులు చేసి ఓటమి చవిచూసింది. విజేత జట్టుకు రూ.30 వేలు, బీవీఅండ్‌బీఎన్ జట్టుకు రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి హైమాహాస్పిటల్ యూత్ రూ. 10 వేలు, వేటపాలెం ఫ్రెండ్స్ టీంకు నాలుగవ బహుమతి రూ. 7500 అందజేశారు.

## వ్యంగ్యం, హాస్యంతో అలరించిన కవులు

చీరాల, మే 11 (ఆంధ్రజ్యోతి) : పూర్వం కవులు సందర్భానుచితంగా సాహిత్యంతో వ్యంగ్యం, హాస్యభాస్యంతో అలరించే వారని, ఆ తీపి మధురాలు ఎనలేనివని ప్రముఖ సాహితీవేత్త యడ్లపల్లి శ్రీరామమూర్తి చెప్పారు. ఆదివారం స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో సాహితీ సదస్సు కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా యడ్లపల్లి హాజరై ఉపన్యసించారు. కవి పండితులు ప్రయోగాత్మకంగా అలరించే పలు అంశాలను వివరించి అందర్నీ ఉత్సాహపరిచారు. అలాగే సాహిత్యంలో చమత్కారాలు అంశంపై అవగాహన కల్పించారు. అనంతరం సీనియర్ సిటిజన్స్ శ్రీరామమూర్తిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు హరిహరరావు, రామారావు, బీరక సుందరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రముఖ సాహితీవేత్త శ్రీరామమూర్తిని సత్కరిస్తున్న ప్రతినిధులు